ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ సంపుటి: 20 సంచిక : 233 గురువారం 23, ఏప్రిల్ 2026 పేజీలు: 04 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com

# హైకోర్టులో కేసీఆర్, హరీశ్‌రావులకు ఊరట




కాళేశ్వరం కమిషన్ పై కీలక తీర్పు
ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలకు స్టే
విచారణలో నిబంధనలు పాటించలేదన్న కోర్టు
జీవో 6ను సవాలు చేస్తూ పలువురు నేతల పిటిషన్లు
వాదనలు వినకుండా అభియోగాలు మోపారన్న పిటిషనర్లు
ప్రజాప్రయోజనాల కోసం కమిషన్ ఏర్పాటన్న ప్రభుత్వం
కాళేశ్వరం వ్యవహారంపై సీబీఐ విచారణకు రాష్ట్ర విజ్ఞప్తి
హైకోర్టు తీర్పుపై రాజకీయ పార్టీల ప్రతిస్పందనలు
బీఆర్ఎస్ శ్రేణుల్లో సంబరాలు, కాంగ్రెస్‌పై విమర్శలు

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణలో అవకతవకల ఆరోపణలపై నియమించిన కమిషన్‌కు సంబంధించిన వివాదంలో తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను ఆధారంగా తీసుకుని పిటిషనర్లపై ఎలాంటి చర్యలు చేపట్టవద్దని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులకు తాత్కాలిక ఊరట లభించింది. కమిషన్ నివేదిక చుట్టూ నెలకొన్న వివాదానికి ఈ తీర్పు కీలక మలుపుగా భావిస్తున్నారు. హైకోర్టు ధర్మాసనం విచారణ సందర్భంగా కమిషన్ విధానంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. విచారణలో అవసరమైన న్యాయపరమైన ప్రమాణాలు పాటించలేదని అభిప్రాయపడింది. కమిషన్ నివేదికలో వ్యక్తులపై సూచనలు చేయాలంటే వారి వాదనలు పూర్తిగా వినాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఈ ప్రాథమిక నిబంధనలను పాటించకుండా నివేదిక సమర్పించడం సరైన విధానం కాదని వ్యాఖ్యానించింది.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన బ్యారేజీల నిర్మాణాల్లో అవకతవకల ఆరోపణల నేపథ్యంలో ..మిగతా 2లో

# ఆర్టీసీ సమ్మె.. జనం ఇక్కట్లు

రాష్ట్రవ్యాప్తంగా నిలిచిన బస్సులు
ఐఏఎస్ కమిటీతో చర్చలు విఫలం
32 డిమాండ్ల సాధనకై కార్మికుల పట్టుదల
డిపోల ముందు కార్మికుల ఆందోళనలు
రాష్ట్రవ్యాప్తంగా పోలీసుల బందోబస్తు
పలు జిల్లాల్లో రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం
ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో అధికారుల ప్రయత్నాలు
ప్రయాణికుల ప్రైవేట్ రవాణా చార్జీల పెంపు
సమ్మె కొనసాగిస్తామంటూ జేఏసీ స్పష్టత




**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల సమ్మె బుధవారం ఉదయం నుంచి ప్రారంభమై రాష్ట్రవ్యాప్తంగా రవాణా వ్యవస్థను ప్రభావితం చేసింది. మంగళవారం సచివాలయంలో ఐఏఎస్ అధికారుల కమిటీతో జరిగిన చర్చలు ఫలించకపోవడంతో కార్మిక సంఘాలు సమ్మెకు దిగాయి. అర్ధరాత్రి నుంచే డ్యూటీలకు హాజరు కాకుండా బస్సులను డిపోలకే పరిమితం చేసి నిరసనలు ప్రారంభించాయి. తమ 32 డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.సచివాలయంలో జరిగిన చర్చలు సుమారు మూడు గంటలపాటు కొనసాగాయి. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ నేతృత్వంలోని కమిటీ కార్మిక సంఘాల ప్రతినిధులతో విస్తృతంగా చర్చలు జరిపింది. ఉద్యోగుల సమస్యలు, ఆర్థిక అంశాలు, సేవా నిబంధనలపై వివరాలు సేకరించింది. ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి సానుకూలంగా ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితుల కారణంగా కొంత సమయం అవసరమని కమిటీ అభిప్రాయం వ్యక్తం చేసింది. నాలుగు వారాల గడువు ఇవ్వాలని విజ్ఞప్తి చేసినా జేఏసీ నాయకులు అంగీకరించలేదు. తమ డిమాండ్లపై స్పష్టమైన హామీ లేకపోవడంతో చర్చలు విఫలమయ్యాయి.సమ్మె ప్రారంభంతో రాష్ట్రవ్యాప్తంగా వేలాది బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. హైదరాబాద్‌తో పాటు పలు నగరాలు, పట్టణాల్లో బస్టాండ్లు ఖాళీగా మారాయి.ప్రయాణికులు బస్సుల కోసం ఎదురుచూస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు ప్రాంతాల్లో డిపోల ముందర ..మిగతా 2లో



# బీజేపీ బీఆర్ఎస్ మధ్య రహస్య ఒప్పందం

కాళేశ్వరంపై హైకోర్టు తీర్పు
సాంకేతికపరమైన అంశాలకే పరిమితమన్న మహేశ్ గౌడ్
కాళేశ్వరంలో భారీ అవినీతి జరిగిందన్నది జగమెరిగిన సత్యమని వ్యాఖ్య
బాధ్యులైన వారు ఎప్పటికైనా శిక్ష అనుభవించాల్సిందేనన్న పీసీసీ అధ్యక్షుడు

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై తెలంగాణ హైకోర్టు తాత్కాలికంగా స్టే విధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ తీర్పు కేవలం సాంకేతికపరమైన అంశాలకే పరిమితమని, అవినీతి జరగలేదని కోర్టు ఎక్కడా చెప్పలేదని స్పష్టం చేశారు.

కోర్టు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను కానీ, దాని విచారణను కానీ తప్పుబట్టలేదని... కేవలం నివేదిక రూపకల్పనలో అనుసరించిన విధానాన్ని మాత్రమే ప్రశ్నించిందని ఆయన వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిందన్నది జగమెరిగిన సత్యమని, ..మిగతా 2లో

# కుట్రలు కూలాయి.. కాళేశ్వరం గెలిచింది



కక్ష కట్టినట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లర ప్రచారం చేసింది
కుంగింది కాళేశ్వరం కాదు.. కేసీఆర్‌పై చేసిన కుట్రలు
మాపై బురదచల్లారు కానీ.. నిప్పులాంటి నిజం బయటకు వచ్చింది
అబద్ధానికి ఆడంబరం ఎక్కువ.. కానీ, ఆయుష్షు తక్కువ
అబద్ధాలతో అద్భుతమైన నిజాలను చాలా కాలం దాచలేదు. కేటీఆర్


**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

కాళేశ్వరం ప్రాజెక్టు విచారణకు సంబంధించి తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పుపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. “నిజం నిలకడ మీద తెలుస్తుంది” అనే నానుడి నేడు నిజమైందని, కాళేశ్వరంపై కాంగ్రెస్ పార్టీ చేసిన దుష్ప్రచారం తప్పని తేలిపోయిందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై , కేంద్రంలోని బిజెపి తీరుపై నిప్పులు చెరిగారు.

కాళేశ్వరం కుంగిపోయిందని రాష్ట్రమంతా తిరిగిన రేవంత్ రెడ్డికి (పిట్టల దొర) హైకోర్టు తీర్పు ఒక చెంపపెట్టు లాంటిదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీని బ్యారేజీ వద్దకు తీసుకువచ్చి ఫొటోలు దిగి, అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను తాను మొదటి నుంచీ ‘పీసీసీ రిపోర్ట్’ అని పిలుస్తున్నానని, నేడు కోర్టు తీర్పుతో ..మిగతా 2లో

# కాంగ్రెస్ రాజకీయ కుట్రలు బట్టబయలు..

ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు వద్దని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
కేసీఆర్, హరీశ్ రావులకు తెలంగాణ హైకోర్టులో ఊరట
ఇది కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలను బట్టబయలు చేసిందన్న హరీశ్ రావు
కక్షసాధింపులు మాని రైతుల ప్రయోజనాలు కాపాడాలని ప్రభుత్వానికి హరీశ్ సూచన



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి టి. హరీశ్ రావులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ తీర్పు కాంగ్రెస్ పార్టీ రాజకీయ కుట్రలను బట్టబయలు చేసిందని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. "ఎన్ని కుట్రలు పన్నినా చివరకు న్యాయస్థానాల్లో న్యాయమే గెలుస్తుందని, సత్యమే నిలుస్తుందని మరోసారి రుజువైంది" అని ఆయన అన్నారు.

కేసీఆర్, హరీశ్ రావుతో పాటు పలువురు మాజీ అధికారులు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. విచారణ కమిషన్ చట్టంలోని ..మిగతా 2లో

# ఆర్టీసీ కార్మికులు సమ్మె విరమించండి

29 డిమాండ్లు పరిష్కరిస్తాం
మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ
కార్మికుల డిమాండ్లపై సానుకూల స్పందన
నాలుగు వారాల్లో కమిటీ నివేదిక
పెండింగ్ బకాయిలన్నీ చెల్లించిన ప్రభుత్వం
విలీనం, ఎన్నికలపై సాంకేతిక చర్చలు
మహాలక్ష్మి పథకంతో పెరిగిన బాధ్యత
భారీగా కొత్త నియామకాలు, కారుణ్య నియామకాలు
పేదల ప్రయాణాలకు ఆటంకం కలిగించొద్దన్న మంత్రి



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో నెలకొన్న సమ్మె పరిస్థితులపై రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటన చేశారు. ఆర్టీసీ కార్మికులు లేవనెత్తిన 32 ప్రధాన అంశాల్లో 29 అంశాల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వాటిపై ఎలాంటి ..మిగతా 2లో

# పెద్దల చదువుకు పెద్ద పీట..

వయోజనుల్లో అక్షరాస్యత పెంపుపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో విద్యా రంగంలో వేగంగా సంస్కరణలు
విద్యా రంగంలో తెలంగాణ దూకుడు
సీఎం రేవంత్ నేతృత్వంలో విద్యా రంగంలో వేగంగా సంస్కరణలు




**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

మారుతున్న కాలానికి తగినట్లు మారితేనే మనుగడ సాధ్యమవుతుంది.. ఈక్రమంలోనే విద్యా రంగంలోనూ పలు సంస్కరణలకు ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా శాఖను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. పిల్లలంతా బడుల్లో ఉండడమే కాదు పెద్దలు సైతం అక్షరాలు నేర్చుకోవాలని... ఆధునిక కాలపు అవసరాలకు తగినట్లు తమను తాము మల్చుకోవాలనేది రాష్ట్ర ప్రభుత్వం యోచన. అందుకే వయోజన అక్షరాస్యత పెంపునపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనపర్చుతోంది. అదే సమయంలో పాఠశాల విద్యా ..మిగతా 2లో

## కాంగ్రెస్ రాజకీయ కుట్రలు బట్టబయలు..

**మొదటిపేజీ తరువాయి**



నిబంధనలను ఘోష్ కమిషన్ పాటించలేదని ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రాథమిక హక్కులు, సహజ న్యాయ సూత్రాలను విస్మరించి జరిపిన విచారణను హైకోర్టు కొట్టివేసిందని హరీశ్ రావు తెలిపారు.
వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించేలా కమిషన్ చేసిన వ్యాఖ్యలు చెల్లవని, ఆ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోరాదని కోర్టు స్పష్టంగా చెప్పిందని ఆయన వివరించారు. ఈ తీర్పుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాటకాలు బట్టబయలయ్యాయని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రాజకీయ బురదజల్లుడు ఆపి, దెబ్బతిన్న పిల్లర్ల మరమ్మతులు పూర్తి చేసి రైతుల ప్రయోజనాలను కాపాడాలని హరీశ్ రావు విజ్ఞప్తి చేశారు.
కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణకు కాంగ్రెస్ ప్రభుత్వం 2024 మార్చిలో జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ 2025 జులై 31న ప్రభుత్వానికి నివేదిక సమర్పించి, కేసీఆర్, హరీశ్ రావులను బాధ్యులుగా పేర్కొన్న విషయం తెలిసిందే.

## పెద్దల చదువుకు పెద్ద పీట..

**మొదటిపేజీ తరువాయి**



రంగంపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

**100 శాతం అక్షరాస్యత...**
**వయోజన విద్యకు ప్రాధాన్యం**

సంపూర్ణ అక్షరాస్య రాష్ట్రంగా తెలంగాణను మార్చాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుతుంది. 45 ఏళ్లు పైబడిన వయసులో అక్షరాస్యత తక్కువగా ఉండటాన్ని ప్రభుత్వం గుర్తించింది. దీంతో చాలా కాలంగా నిర్లక్ష్యానికి గురైన వయోజనుల విద్యపై ప్రత్యేక దృష్టి సారించింది. ఎక్కడికక్కడ వయోజన విద్య తరగతులు నిర్వహించారు. దీంతో 2025-26 సంవత్సరంలో 6.31 లక్షల మంది పెద్దలు అక్షరాస్యత పరీక్షలకు హాజరయ్యారు. గత ప్రభుత్వం హయాంలో, ముఖ్యంగా 2019 నుంచి 2024 వరకు వయోజన విద్య పెంపు అంశాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. దీంతో ఆ సమయంలో వయోజన విద్య పూర్తిగా కుంటుపడింది. అందుకు విరుద్ధంగా ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వయోజన విద్యపై ప్రత్యేక దృష్టి సారించింది. ఫలితంగానే వయోజన విద్యలో పెద్ద ఎత్తున పెరుగుదల నమోదైంది.

**పాఠశాలల్లో కొత్త మార్పులు**

తెలంగాణలోని పాఠశాలల్లో విద్యలో నాణ్యత పెంచేందుకు ప్రజా ప్రభుత్వం నూతన విధానాన్ని తీసుకొచ్చింది. అకడమిక్ ప్యానెల్ ఇన్స్పెక్షన్ టీమ్స్ ద్వారా పాఠశాలల్లో బోధన విధానాలను ఉన్నతీకరించింది. ఇది విద్యార్థులకు అత్యాధునిక పద్ధతులలో అభ్యసనలో మెలుకువలు నేర్పించేందుకు ఉపయోగపడింది. ముఖ్యంగా పెద్దపల్లి జిల్లాలో 61 పాఠశాలల్లో ఈ విధానం అమలు చేసి, బోధనలో ఉన్న ఇబ్బందులు, అనుకూలతలను గుర్తించారు. చాలామంది ఉపాధ్యాయులకు మంచి పరిజ్ఞానం ఉన్నప్పటికీ, తరగతుల్లో విద్యార్థుల భాగస్వామ్యం తక్కువగా ఉండడాన్ని ఈ టీమ్స్ గుర్తించాయి. దానిని సరిదిద్ది సమర్థంగా అమలు చేయడంతో మంచి ఫలితాలు తీసుకురావడం సాధ్యమైందని విద్యా శాఖ అధికారులు భావిస్తున్నారు.

**ఆరు నెలల్లోనే మంచి ఫలితాలు**

ప్రజా ప్రభుత్వ చర్యల ఫలితంగా తక్కువ సమయంలోనే పాఠశాల విద్యలో మంచి మార్పులు చోటుచేసుకున్నాయి. బోధన పద్ధతుల్లో వ్యూహాత్మకత 48% నుంచి 68%కు పెరిగింది. తరగతుల గదుల మెరుగైన నిర్వహణలో 42% నుంచి 65%కు, బోధనాభ్యసన సామగ్రి, వనరుల వినియోగం 35% నుంచి 58%కు పెరిగింది. ఇవన్నీ మంచి ఫలితాలు వచ్చేందుకు కారణమయ్యాయి.

**ప్రాథమిక విద్యపై ప్రత్యేక దృష్టి**

పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు ప్రాథమిక దశలోనే అక్షరాలు రాయడం, అంకెలు నేర్చుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (FLN) పై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. దీంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 202223 విద్యా సంవత్సరం నుంచి 202526 వరకు మంచి ఫలితాలు వచ్చాయి. తెలుగులో 9 శాతం నుంచి 35% శాతం వరకు... ఇంగ్లీష్ లో 4 శాతం, 29% శాతం... ఉర్దూ లో 19 శాతం నుంచి 40% శాతం వరకు అభ్యసన సామర్థ్యాలు పెరిగాయి. భాషతో పాటు అంకెలు నేర్చుకోవడం.. కూడికలు, తీసివేతలు వంటి గణిత ప్రక్రియల్లోనూ 18 శాతం నుంచి 30 శాతం ఫలితాలు అధికంగా వచ్చాయి.

**విద్యకు అత్యధిక నిధుల వినియోగం**

సమగ్ర శిక్షా పథకం కింద వచ్చిన నిధులను వినియోగించడంలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. 2025-26లో 84% నిధులు వినియోగించుకొని రాష్ట్రం దేశంలో మొదటి స్థానంలో ఉంది. ప్రతి రూపాయి విద్య కోసం, విద్యార్థుల కోసం వ్యయం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. విద్యా రంగంలో ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు తెలంగాణను దేశంలో ముందువరుసకి తీసుకెళుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణలు విద్యార్థులు, ఉపాధ్యాయులకు విద్యా వ్యవస్థ ప్రగతికి మరింత దోహదపడుతున్నాయి. విద్యా రంగంలో తెలంగాణ ఆదర్శ రాష్ట్రంగా ముందుకు సాగుతోంది.

## ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం

**కౌడిపల్లి ప్రజా స్వరం :-**



మండల పరిధిలోని కన్నారం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఉపాసన రాణి రామచందర్ మరియు మహమ్మద్ నగర్ లో కుమ్మరి యాదమ్మ నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను బుధవారం రోజున ఎంపీడీవో శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రారంభించారు ఈ కార్యక్రమంలో కన్నారం సర్పంచ్ రాములు, మహమ్మద్ నగర్ సర్పంచ్ రవికుమార్ యాదవ్ ఉపసర్పంచులు అనిల్ కుమార్ పోచయ్య మహమ్మద్ నగర్ మాజీ ఉపసర్పంచ్ ఫారూఖ్ ప్రముఖులు బాల గౌడ్ రాము కృష్ణ పంచాయతీ సెక్రెటరీ వార్డు మెంబర్లు తదితరులు ఉన్నారు.

# హైకోర్టులో కేసీఆర్, హరీశ్‌రావులకు ఊరట

**మొదటిపేజీ తరువాయి**



ఈ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. 2024 మార్చి 14న జారీ చేసిన జీవో 6 ద్వారా కమిషన్‌ను అధికారికంగా నియమించారు. అనంతరం పలువురు అధికారులను, సంబంధిత వ్యక్తులను విచారణకు పిలిపించి వాంగ్మూలాలు సేకరించి నివేదిక రూపొందించారు. ఆ నివేదికను ప్రభుత్వం స్వీకరించి తదుపరి చర్యలపై ఆలోచన ప్రారంభించింది.ఈ నేపథ్యంలో కమిషన్ చట్టబద్ధతను సవాలు చేస్తూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఐఏఎస్ అధికారులు ఎస్‌కే జోషి, స్మితా సభర్వాల్ వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. కమిషన్ విచారణలో తమ వాదనలు పరిగణలోకి తీసుకోలేదని, అభియోగాలు మోపే ముందు సరైన అవకాశాలు ఇవ్వలేదని వారు వాదించారు. ఇది సహజ న్యాయం సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు.
పిటిషనర్ల వాదనలను పరిశీలించిన కోర్టు ఈ అంశంపై సుదీర్ఘంగా విచారణ చేపట్టింది. ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం వాదనలు పూర్తిగా విన్న తర్వాత తీర్పును రిజర్వు చేసింది. అనంతరం నిర్ణీత తేదీకి ప్రకటించాల్సిన తీర్పు కొన్ని కారణాలతో వాయిదా పడగా, చివరకు బుధవారం వెలువడింది. ఈ తీర్పులో కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.మరోవైపు ప్రభుత్వం తరపు న్యాయవాదులు కమిషన్ ఏర్పాటు ప్రజాప్రయోజనాల కోసమేనని కోర్టుకు వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు దేశంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకాలలో ఒకటిగా నిలుస్తుందని, అందులో చోటుచేసుకున్న అవకతవకలపై నిజానిజాలు వెలికితీయడం అవసరమని తెలిపారు. ప్రజా నిధుల వినియోగంపై పారదర్శకత కోసం కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు వాదించారు.
ఇక ఈ వ్యవహారం సీబీఐ దర్యాప్తు దశకు చేరుకుంది. బ్యారేజీల నిర్మాణాల్లో అవకతవకలు, నిధుల దుర్వినియోగంపై సీబీఐ విచారణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఇప్పటికే ఈ విషయమై కేంద్ర దర్యాప్తు సంస్థకు లేఖ రాసింది. అయితే రాష్ట్రంలో కేసు నమోదు అయ్యిందా అని సీబీఐ ప్రశ్నించడంతో, తాజాగా మరోసారి లేఖ ద్వారా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని విజ్ఞప్తి చేసింది.ఈ పరిణామాల మధ్య హైకోర్టు తీర్పు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. తీర్పును బీఆర్ఎస్ నాయకులు స్వాగతించారు. ఈ నిర్ణయం తమపై చేసిన ఆరోపణలు నిరాధారమని రుజువు చేస్తోందని పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కమిషన్‌ను ఉపయోగించారని విమర్శలు చేశారు. ప్రభుత్వ విధానాలపై కూడా తీవ్రంగా స్పందించారు.
మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ హైకోర్టు తీర్పు కీలక మలుపు అని వ్యాఖ్యానించారు. కమిషన్ నివేదిక చట్టబద్ధతపై సందేహాలు ఉన్నాయని, కోర్టు వాటిని స్పష్టం చేసిందన్నారు. కేసీఆర్‌పై చేసిన ఆరోపణలకు సంబంధించి ప్రత్యర్థి పార్టీలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అభివృద్ధికి సంబంధించిన అంశాలను పక్కనపెట్టి రాజకీయ విమర్శలు చేయడం సరికాదన్నారు.ఇక తీర్పు వెలువడిన వెంటనే బీఆర్ఎస్ శ్రేణులు తెలంగాణ భవన్ వద్ద సంబరాలు జరిపాయి. బాణసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశాయి. ఈ తీర్పు తమకు న్యాయం చేసినట్లు భావిస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీపై విమర్శలు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.
కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్రానికి కీలకమైన నీటిపారుదల ప్రాజెక్టుగా నిలిచింది. వ్యవసాయం, నీటి వనరుల వినియోగంలో దీని పాత్ర విశేషంగా ఉంది. ఈ ప్రాజెక్టు చుట్టూ నెలకొన్న వివాదాలు, రాజకీయ ఆరోపణలు, విచారణలు రాష్ట్ర రాజకీయాల్లో కీలక అంశంగా మారాయి. హైకోర్టు తాజా తీర్పు ఈ వివాదానికి తాత్కాలికంగా ముగింపు పలికినప్పటికీ, భవిష్యత్తులో మరిన్ని పరిణామాలు చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది.హైకోర్టు తీర్పు కాళేశ్వరం వ్యవహారంలో కీలక దశగా నిలిచింది. కమిషన్ విధానంపై ప్రశ్నలు లేవనెత్తుతూ న్యాయపరమైన ప్రమాణాల ప్రాముఖ్యతను మరోసారి గుర్తు చేసింది. ఇకపై ఈ కేసు దిశ ఎలా మలుపుతీసుకుంటుందో అన్నదానిపై అందరి దృష్టి నెలకొంది.

## కుట్రలు కూలాయి.. కాళేశ్వరం గెలిచింది

**మొదటిపేజీ తరువాయి**



అది నిజమని నిరూపితమైందని అన్నారు. రేవంత్ రెడ్డి ఎవరిని తెచ్చి ఏ విధంగా వాదించినా, చివరకు సత్యమే గెలిచిందని, నిప్పులాంటి నిజం బయటకు వచ్చిందని ఆయన పునరుద్ఘాటించారు.
కాళేశ్వరం ప్రాజెక్టుపై లక్ష కోట్ల కుంభకోణం జరిగిందని, ఇది బిఆర్ఎస్‌కు ఏటీఎంలా మారిందని రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రాజెక్టుకు అయిన మొత్తం ఖర్చు 94 వేల కోట్లు అయితే, లక్ష కోట్ల అవినీతి ఎలా సాధ్యమని ఆయన ప్రశ్నించారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోలేదని, రాజకీయ లబ్ధి కోసం వీళ్లే కూల్చారనే విషయం త్వరలోనే బయటపడుతుందని ఆయన జోస్యం చెప్పారు. ప్రాజెక్టులు కట్టడమే నేరమన్నట్లుగా ప్రచారం చేయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు.
ఈ విషయంలో కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచిన బీజేపీని, ప్రధాని మోదీని కేటీఆర్ ప్రశ్నించారు. కాళేశ్వరం విషయంలో ఆఘమేఘాల మీద స్పందించిన ఎన్డీఎస్ఏ (NDSA), మరి ఎస్ఎల్బీసీ (SLBC) కూలినప్పుడు, వట్టెం పంప్ హౌస్ మునిగిపోయినప్పుడు ఎక్కడకు పోయిందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ మీద ఉన్న వ్యక్తిగత కక్షతో రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదని హితవు పలికారు.
2014 ముందు , కేసీఆర్ పాలన ముగిసే నాటికి పెరిగిన పంట దిగుబడే కాళేశ్వరం ప్రాజెక్టు విజయానికి నిదర్శనమని కేటీఆర్ గుర్తు చేశారు. ఇప్పటికైనా రాజకీయ కక్షలు పక్కన పెట్టి, కాళేశ్వరం నీళ్లను లిఫ్టింగ్ చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అబద్ధపు ప్రచారాలు మాని, పరిపాలనపై దృష్టి పెట్టాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కేటీఆర్ సూచించారు.

## ఆర్టీసీ కార్మికులు సమ్మె విరమించండి

**మొదటిపేజీ తరువాయి**



వ్యతిరేకత లేదని స్పష్టం చేశారు. ఈ 29 డిమాండ్లు తక్షణమే పరిష్కారమయ్యే సామాన్య అంశాలని, మిగిలిన మూడు అంశాలపై స్పష్టమైన కార్యాచరణ ఉందని వివరించారు. సమ్మె అనేది సమస్యకు పరిష్కారం కాదని, చర్చల ద్వారానే ముందుకు వెళ్లాలని కార్మికులకు, జేఏసీ నేతలకు విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ కార్మికులను తన కుటుంబ సభ్యులుగా భావిస్తానని, సంస్థ మనుగడను, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తక్షణమే సమ్మె విరమించి విధుల్లో చేరాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికే నలుగురు ఉన్నత స్థాయి అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేసిందని, ఈ కమిటీకి నాలుగు వారాల గడువు ఇచ్చామని తెలిపారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నామన్న విమర్శల్లో వాస్తవం లేదని, శాస్త్రీయంగా సమస్యలను పరిష్కరించడానికే ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి మండిపడ్డారు.
గత పదేళ్ల పాలనలో ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొన్న ఇబ్బందులు అందరికీ తెలుసని, కానీ ప్రస్తుత ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేసిందని పొన్నం ప్రభాకర్ గుర్తు చేశారు. 2017 పీఆర్సీ బకాయిలను క్లియర్ చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న డీఏలన్నింటినీ మంజూరు చేశామని వెల్లడించారు. 2013 నుంచి పెండింగ్‌లో ఉన్న బాండ్లను కూడా క్లియర్ చేయడం ద్వారా కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించామన్నారు. పీఎఫ్ బకాయిలు గతంలో రూ. 1205 కోట్లు ఉండగా, ప్రస్తుత ప్రభుత్వం వాటిని రూ. 600 కోట్లకు తగ్గించిందని, అలాగే రూ. 690 కోట్లు ఉన్న సీసీఎస్ బకాయిలను రూ. 300 కోట్లకు పరిమితం చేశామని వివరించారు. ఇవే కాకుండా ప్రతినెలా పీఎఫ్, సీసీఎస్ నిధుల కోసం రూ. 75 కోట్లు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నామని, దీనివల్ల భవిష్యత్తులో బకాయిలు పేరుకుపోయే ప్రమాదం ఉండదని ధీమా వ్యక్తం చేశారు. ఆర్టీసీని ఆర్థికంగా కోలుకునేలా చేస్తున్న తరుణంలో సమ్మె చేయడం అంటే 'మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు' అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.
రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంత ప్రజలకు, పేదలకు ఆర్టీసీయే ఏకైక ఆధారమని మంత్రి అన్నారు. ప్రతిరోజూ ప్రయాణించే 65 లక్షల మందిలో 45 లక్షల మంది మహిళలే ఉన్నారని, విద్యావంతులు, రోగులు, వృద్ధులు ఈ వ్యవస్థపైనే ఆధారపడి ఉన్నారని గుర్తు చేశారు. సామాన్య ప్రజలకు కార్లలో తిరిగే స్తోమత లేదని, సమ్మె వల్ల వారి జీవనోపాధి దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కు నాయకులకు ఉందని, కానీ సాధారణ కార్మికులు మాత్రం విధులకు హాజరై ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. తాను స్వయంగా విద్యార్థి నాయకుడిగా వచ్చిన వాడినని, కార్మికుల కష్టనష్టాలు తనకు బాగా తెలుసని, అందుకే కార్మికులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉన్నప్పుడు మొండిగా సమ్మెకు వెళ్లడం సరికాదని, ప్రజల అసౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

## ఆర్టీసీ సమ్మె.. జనం ఇక్కట్లు

**మొదటిపేజీ తరువాయి**

కార్మికులు నిరసనలు చేపట్టి నినాదాలు చేశారు. ఆర్టీసీ సేవలు పూర్తిగా నిలిచిపోవడంతో సాధారణ ప్రజల ప్రయాణాలకు అంతరాయం ఏర్పడింది. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, మహబూబ్‌నగర్ వంటి జిల్లాల్లో సమ్మె ప్రభావం ఎక్కువగా కనిపించింది. వందల సంఖ్యలో బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. గోదావరిఖనిలోనే వందల బస్సులు నిలిచిపోయాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో కార్మికులు విధులను బహిష్కరించి డిపో వద్ద శాంతియుత నిరసన చేపట్టారు. వికారాబాద్‌లో కూడా బస్సులు కదలకుండా నిలిచిపోవడంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల కోసం ఎదురుచూడాల్సి వచ్చింది.
సమ్మె నేపథ్యంలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ముఖ్యంగా డిపోలు, బస్టాండ్ల వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించారు. బస్సులకు ఎలాంటి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. పలు ప్రాంతాల్లో నిరసనలు శాంతియుతంగా సాగుతున్నప్పటికీ పరిస్థితిని పర్యవేక్షించేందుకు ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉన్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు తగ్గించేందుకు అధికారులు కొన్ని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టారు. మహబూబ్‌నగర్‌లో పరిమిత సంఖ్యలో విద్యుత్ బస్సులను నడిపే ప్రయత్నం చేశారు. అయితే ఇవి సరిపోకపోవడంతో ఎక్కువ మంది ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సి వచ్చింది. హైదరాబాద్‌లో ఆటోలు, క్యాబ్ సేవల డిమాండ్ ఒక్కసారిగా పెరిగింది. దీంతో చార్జీలు పెరగడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
రైల్వే స్టేషన్లు, ముఖ్యంగా చర్లపల్లి ప్రాంతంలో రవాణా సౌకర్యాల కొరత తీవ్రంగా కనిపించింది. బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు ఆటోలు, క్యాబ్ సేవలకు మొగ్గు చూపుతున్నారు. రాపిడో, ఓలా, ఉబర్ వంటి ఆన్‌లైన్ సేవల వినియోగం పెరిగింది. అయినప్పటికీ అధిక చార్జీల కారణంగా సాధారణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.ఇక ఆర్టీసీ జేఏసీ నాయకులు తమ సమ్మెను మరింత ఉధృతం చేసే దిశగా చర్యలు చేపడుతున్నారు. హైదరాబాద్‌లో గన్‌పార్క్ వద్దకు వెళ్లి అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా నిరసనలను విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకునే వరకు సమ్మె కొనసాగుతుందని నాయకులు హెచ్చరించారు.
ప్రస్తుతం సమ్మె కారణంగా రాష్ట్ర రవాణా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. రోజువారీ పనుల కోసం ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. బస్సులు లేకపోవడంతో వైద్య సేవలు, అత్యవసర ప్రయాణాలు కూడా ప్రభావితమవుతున్నాయి.ఆర్టీసీ సమ్మె రాష్ట్రవ్యాప్తంగా ప్రజల జీవన విధానంపై గణనీయ ప్రభావం చూపుతోంది. ప్రభుత్వం, కార్మిక సంఘాల మధ్య చర్చలు మళ్లీ ప్రారంభమవుతాయా లేదా అన్నది కీలకంగా మారింది. సమస్యకు త్వరితగతిన పరిష్కారం దొరికితేనే పరిస్థితి సాధారణ స్థితికి చేరుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అప్పటివరకు సమ్మె ప్రభావం కొనసాగుతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.



## బీజేపీ బీఆర్ఎస్ మధ్య రహస్య ఒప్పందం

**మొదటిపేజీ తరువాయి**



బాధ్యులైన వారు ఎప్పటికైనా శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారు.
గతంలో ప్రధాని మోదీ, అమిత్ షా వంటి నేతలు కాళేశ్వరంను 'ఏటీఎం'తో పోల్చారని గుర్తు చేస్తూ... కాళేశ్వరం అంశంపై ఇప్పుడు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు సీబీఐ విచారణ ఎందుకు చేయించడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీల మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందం వల్లే ఈ కుంభకోణంపై కేంద్రం మౌనంగా ఉందని ఆయన ఆరోపించారు.



# పారదర్శకంగా అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ చేయాలి...

- **నిజాన్ని వెలికి తీయాలి అబద్ధాన్ని స్వాగతించవద్దు....**
- **ప్రతి దరఖాస్తును కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించాలి...**
- **నిజమైన, అర్హత గల జర్నలిస్టులకు కార్డులు అందాలి...**
- **డెస్క్ జర్నలిస్టుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా....**
- **జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ చైర్పర్సన్, జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్....**

**మెదక్ ఏప్రిల్ 22 (ప్రజా స్వరం)**

నిజమైన ,అర్హత గల జర్నలిస్టుల కే అక్రిడేషన్ కార్డు అందాలని జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్ పర్సన్, కలెక్టర్ ప్రతిమా సింగ్ జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులకు సూచించారు. బుధవారం మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్ పర్సన్, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధ్యక్షతన జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు, డిపిఆర్ఓ, అధికారులతో సమావేశం నిర్వహించారు. ముందుగా నూతనంగా నియామకమైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. దరఖాస్తులు ఎన్ని వచ్చాయో





అని డిపిఆర్ఓ ను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తు విధానం, అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ చైర్ పర్సన్, కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న మీడియా ప్రతినిధులకు అక్రిడియేషన్ కార్డుల జారీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా అక్రిడిటేషన్ కార్డులు పంపిణీ జరగాలన్నారు.

ప్రజాస్వామ్యంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని, ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడంలో మీడియా ఒక ప్రధాన వేదికగా ఉంటుందనీ పేర్కొన్నారు. అందువల్ల మీడియా ప్రతినిధుల గుర్తింపు ప్రక్రియలో ఎలాంటి వివక్ష లేకుండా, నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందనీ, అక్రిడిటేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారుల ద్వారా సమగ్రంగా పరిశీలించి, అర్హత ప్రమాణాలు పూర్తిచేసిన అభ్యర్థులకు మాత్రమే కార్డులు జారీ చేయాలన్నారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం ఖచ్చితంగా పరిశీలించడంతో పాటు, అవసరమైన పత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో తనిఖీ చేయాలనీ కమిటీ సభ్యులకు సూచించారు. ఎటువంటి అనర్హులుకు కార్డులు జారీ కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే అభ్యంతరాల స్వీకరణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి, వచ్చిన ఫిర్యాదులను సమగ్రంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మీడియా ప్రతినిధులు సమర్పించే దరఖాస్తుల్లో వృత్తి సంబంధిత ప్రమాణాలు, అనుభవం, సంస్థ గుర్తింపు వంటి అంశాలను ప్రధానంగా పరిగణలోకి తీసుకోవాలనీ తేల్చి చెప్పారు. నకిలీ ధృవపత్రాలు సమర్పించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటమన్నారు. అక్రిడిటేషన్ కార్డులు పొందిన మీడియా ప్రతినిధులు తమ వృత్తి నైతిక విలువలను పాటిస్తూ, సమాజానికి బాధ్యతాయుతంగా సేవలందించాలన్నారు. ప్రజలకు నిజమైన సమాచారం అందించడం, ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రచారం చేయడం, సామాజిక సమస్యలను వెలుగులోకి తీసుకురావడం వంటి అంశాల్లో మీడియా తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలనీ, జిల్లా స్థాయిలో అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని, నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలన్నారు. ప్రతి దశలో పారదర్శకతను పాటిస్తూ, ఎటువంటి వివాదాలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు, డిప్యూటీ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ భూపాల్, కమిటీ సభ్యులు అశోక్, గోపాల్ గౌడ్, దేవరాజ్, శ్రీధర్, ఫరూక్ హుస్సేన్, శంకర్ దయాల్ చారి, సురేందర్ రెడ్డి, నాగరాజు, ఏపీఆర్ఓ బాబురావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు






# ఆర్టీసీ కార్మికులు సమ్మె ఆగిన బస్ లు....

- **డిపో వద్ద బైఠాయించిన ఆర్టీసీ కార్మికులు.....**
- **ప్రయాణికుల కోసం డిపో మేనేజర్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు....**

**మెదక్ ఏప్రిల్ 22 (ప్రజా స్వరం)**

ఆర్టీసీ జేఏసీ ప్రభుత్వం తో జరిపిన చర్చలు విఫలం అవ్వడంతో ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె బాట పట్టారు. ఈ సందర్భంగా బుధవారం అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ కార్మికులు విధులు బహిష్కరించడంతో ఎక్కడికక్కడ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. మెదక్ ఆర్టీసీ డిపో వద్ద తెల్లవారుజామున జేఏసి నేతలతో కలిసి కార్మికులు పెద్ద ఎత్తున బైఠాయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు భారీ బందోబస్తుతో మోహరించారు. మెదక్ ఆర్టీసీ డిపోలో పోలీసులకు, ఆర్టీసీ కార్మికుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. బస్సులను డిపోల నుండి బయటకు వెళ్లనివ్వకుండా కార్మికులు అడ్డుకున్నారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు ఆందోళన విరమించేది లేదని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మిక నేతలు మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న 30 శాతం ఫిట్మెంట్, వేతన బకాయిల చెల్లింపు చేయాలన్నారు. పీఎఫ్, సీసీఎస్ కు సంబంధించిన బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. యూనియన్ల పునరుద్ధరణ చేయాలన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి, ఆర్టీసీ యాజమాన్యానికి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలుమార్లు వినతి పత్రాలను అందించినా స్పందన లేకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం తక్షణం స్పందించి ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో నిరవధిక సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. అయితే కార్మికుల సమ్మెతో ప్రజా రవాణా కు అంతరాయం ఏర్పడింది.

సమ్మె ప్రభావంతో బస్సులు నిలిచిపోవడం వలన ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పని చేసే ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కాగా ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యామ్నాయ ఏర్పాట్ల పై దృష్టి సారించింది. అద్దె బస్సులను నడిపించడంతో పాటు తాత్కాలికంగా కండక్టర్ల నియామకానికి పదో తరగతి ఉత్తీర్ణులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయా డిపో మేనేజర్లు ప్రకటించారు.








## నూతనంగా ఎన్నికైన గ్రామ వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు..

**ప్రజా స్వరం నార్సింగి ఏప్రిల్ 22**

నూతనంగా ఎన్నికైన గ్రామ వార్డు సభ్యులకు నార్సింగి మండల కేంద్రంలోని రైతు వేదికలో ఐదు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఇంచార్జి ఎంపీడీఓ చిన్నా రెడ్డి తెలిపారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018 ప్రకారం గ్రామాల పరిపాలన కొనసాగుతుందని వివరించడంతో పాటు, ఈ శిక్షణలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల విధులు, బాధ్యతలు, గ్రామపంచాయతీలో పారిశుద్ధ్యం నిర్వహణ, నిధుల వినియోగం, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) ద్వారా గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేయడానికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రజల భాగస్వామ్యంతో పారదర్శక పాలన ఎలా అమలు చేయాలనే దానిపై కూడా మార్గదర్శనం చేస్తున్నామని పేర్కొన్నారు. మండలంలోని దాదాపు అన్ని గ్రామాల వార్డు సభ్యులు ఈ శిక్షణలో పాల్గొంటుండగా, గ్రామ అభివృద్ధికి ఇది దోహదపడుతుందని ఇంచార్జి ఎంపీడీఓ చిన్నా రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదాలు జరగకుండా అండర్ పాస్ బ్రిడ్జ్ ఏర్పాటు చేయాలి..

- **సర్పంచ్ వినోద్ కుమార్**

**ప్రజా స్వరం నార్సింగి ఏప్రిల్ 22**

సర్పంచ్ ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు తొలి ప్రాధాన్యతగా వల్లూరులో రోడ్డు ప్రమాదాల నివారణకు సర్పంచ్ పిప్పిరి వినోద్ కుమార్ గుప్తా కంకణం కట్టుకున్నారు. ఇందులో భాగంగా ఎంపీ, ఎమ్మెల్యే, రహదారి అధికారులు, సంబంధిత అధికారుల దృష్టికి మరల్చేలా ఏకధాటిగా కలుస్తూ సమస్య శాశ్వత పరిష్కారం కోసం వేడుకుంటున్నారు. ఈ మేరకు వినోద్ గ్రామ ఉపసర్పంచ్ మియాపురం రేఖతో పాటు కామారెడ్డి జాతీయ రహదారి 44 ప్రాజెక్ట్ డైరెక్టర్ కు వినతి పత్రం సమర్పించినట్లు విలేఖరులకు తెలిపారు. ప్రస్తుతం సర్వీస్ రోడ్ నిర్మాణం జరుగుతున్నప్పటికీ గ్రామ ప్రజలు రహదారి దాటే సమయంలో తీవ్ర ప్రమాదాలు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా విద్యార్థులు, రైతులు, వృద్ధులు ప్రాణాపాయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారని వివరించారు. ఇప్పటికే పలు ప్రమాదాలు చోటుచేసుకుని ప్రజల్లో భయాందోళన నెలకొందని పేర్కొన్నారు. కేవలం సర్వీస్ రోడ్ వల్ల సమస్యలు పరిష్కారం కావని, గ్రామ ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా అండర్పాస్ నిర్మాణం అత్యవసరమని స్పష్టం చేశారు. వినతి పత్రంపై ప్రాజెక్ట్ డైరెక్టర్ సానుకూలంగా స్పందించి సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు. ఇటీవల మండల పర్యటన కోసం వచ్చిన మెదక్ ఎంపీ రఘునందన రావు కు కూడా ఈ విషయాన్ని తెలుపుతూ వినతి పత్రం ఇచ్చామని, సంబంధిత అధికారులను తగిన చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారని సర్పంచ్ పిప్పిరి వినోద్ కుమార్ గుప్తా తెలిపారు.

## స్నేహితుడి పై దాడి చేసి హత్య...

- **ఇద్దరికీ జీవిత ఖైదు, 30 వేల జరిమానా....**
- **శిక్ష పడేందుకు కృషి చేసిన సిబ్బందిని అభినందించిన ఎస్పీ...**

**మెదక్ ఏప్రిల్ 22 (ప్రజా స్వరం)**



మెదక్ జిల్లా రామాయంపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన స్నేహితుడి హత్య కేసులో ఇద్దరు నిందితులకు జిల్లా న్యాయస్థానం జీవిత ఖైదు తో పాటు చెరో 15 వేల చొప్పున జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు. పూర్తి వివరాలు వెల్లడిస్తూ డి. ధర్మారం గ్రామానికి చెందిన నరేందర్ తన స్నేహితులైన పిట్ల పరుశురాములు, చెవిటోల్ల చంద్రంతో కలిసి తరచూ మద్యం సేవించేవాడు. ఈ క్రమంలో వారి మధ్య తలెత్తిన విభేదాలు తీవ్రమై, క్షణిక ఆవేశంలో నిందితులు నరేందర్ పై దాడి చేసి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని చెక్ డ్యాంలో పడేసి ఘటనను దాచి పెట్టేందుకు ప్రయత్నించారు. ఈ ఘటన 2022 మే 4 న వెలుగులోకి రావడంతో రామాయంపేట్ పోలీస్ స్టేషన్లో అప్పటి ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేశారు. దర్యాప్తు అధికారి చంద్రశేఖర్ రెడ్డి సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరించి, సాక్షులను విచారించి నిందితులను అరెస్ట్ చేశారు. తదనంతరం పూర్తి స్థాయి దర్యాప్తు నిర్వహించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత ఐఓ వెంకట రాజా గౌడ్ సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ వాదనలు వినిపించారు. సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా న్యాయమూర్తి నీలిమ నిందితులు నేరం చేసినట్లు నిర్ధారించి ఇద్దరికీ జీవిత ఖైదు తో పాటు చెరో 15 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్పీ తెలిపారు.ఈ కేసులో కోర్ట్ లైజనింగ్ ఆఫీసర్ ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ భూపాల్ సహకరించారు. నిందితులకు శిక్ష పడేందుకు కృషి చేసిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# బస్సు సేవలకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు....

**మెదక్ ఏప్రిల్ 22 (ప్రజా స్వరం)**

ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో ప్రైవేట్ బస్సులు నడుపుతున్న డ్రైవర్లు ఎలాంటి అభద్రత భావానికి గురి కావద్దని మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన భద్రతా చర్యలు తీసుకుంటామని, డ్రైవర్లు నిరభ్యంతరంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఆర్టీసీ బస్సులను ప్రైవేట్ వ్యక్తులు నడుపుతున్న నేపథ్యంలో బస్సుల ప్రయాణానికి అడ్డంకులు కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల రవాణా సౌకర్యాన్ని భంగం కలిగించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. బస్సులను మధ్యలో ఆపడం, మార్గంలో అటంకాలు సృష్టించడం, డ్రైవర్ల పై దాడులకు పాల్పడటం వంటి చర్యలకు దిగితే వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని సహకరించాలని, ఏవైనా సమస్యలు ఉంటే చట్టబద్ధ మార్గాల్లోనే పరిష్కరించుకోవాలని ఎస్పీ సూచించారు.



# గ్రామ అభివృద్ధి నా ద్వేయం.. సర్పంచ్ మహేందర్ సింగ్

**ప్రజా స్వరం నార్సింగి ఏప్రిల్ 22**

నార్సింగి మండలం లోని శంఖాపూర్ తాండా లో ఎన్నికల సమయం లో ఇచ్చిన హామీ మేరకు సర్పంచ్ మహేందర్ సింగ్ సేవాలాల్ మహారాజ్, జగదాంబ మాత దేవాలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తనను గెలిపిస్తే నిర్మాణ దశలో నిలిచిన దేవాలయ నిర్మాణం చేపడతానని హామీ ఇవ్వడం తో పాటు మరో 16 హామీలు ఇచ్చానని తెలిపారు. హామీలు ఇచ్చినట్లుగానే సేవాలల్ జయంతి లో అన్నప్రసాదం కోసం ఆర్థిక సహాయం, ఆడపిల్ల పెళ్ళికి పూస్తే మెట్టలు, పదకొండు వేల పదకొండు వేలు, ఇచ్చి రెండు హామీలు అమలు చేశానని, మూడో హామీ అమలు లో భాగంగా నేడు దేవాలయ నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందని అన్నారు. ఎన్నికల లో ఇచ్చిన అన్ని హామీలు ఖచ్చితంగా నెరవేరుస్తానని, గ్రామ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగు తానని అన్నారు. గ్రామ అభివృద్ధి కోసం పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు సహకరించాలని కోరుతూ, అందరి సహకారం తోనే గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడం సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేందర్ సింగ్ తో పాటు ఉపసర్పంచ్ నరేష్,వార్డు సభ్యులు అనిత, రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.



# దళారులను నమ్మి మోసపోవద్దు

- **ధాన్యం కొనుగోలు కేంద్రాల ను ప్రారంభించిన ఎమ్మెల్యే**

**కౌడిపల్లి ప్రజాస్వరం:-**

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు బుధవారం మండల పరిధిలోని పలు గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన ఆఖరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి 2389 రూపాయలు బి గ్రేడ్ ధాన్యానికి 2369 రూపాయలు ఇస్తుందని వారు తెలిపారు అంతేకాకుండా ధాన్యం బస్తాలు తరలించడానికి లారీలను ప్రభుత్వం సమకూర్చాలని అన్నారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్, మహమ్మద్ నగర్ సొసైటీ సీఈవో దుర్గా గౌడ్, మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సారా రామా గౌడ్, సర్పంచులు శివానందరెడ్డి కుమ్మరి శివలీల, కుమార్, పద్మ, స్వప్న,నాయకులు బొడ్ల నవీన్, పోలా నవీన్, సంతోష్ గౌడ్, గుంజరి ప్రవీణ్, కాంతారావు,ఎల్లం, రామాంజనేయులు, రాజు, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా మహిళా డిగ్రీ కళాశాలలో వార్షికోత్సవం వేడుకలు..

- **విద్యార్థునికి మెమోటో అందజేస్తున్న కళాశాల అధ్యాపకులు, ముఖ్యఅతిథులు**

**గజ్వేల్ ఏప్రిల్ 22 (ప్రజాస్వరం)..**



గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం కళాశాల వార్షికోత్సవం ఘనంగా జరిగింది.ఈ వార్షికోత్సవానికి కళాశాల ప్రిన్సిపల్ అధ్యక్షత వహించి కళాశాల వార్షిక నివేదిక చదివి వినిపించారు . ఈ కళాశాలకు 45 కంప్యూటర్స్ ,యుపిఎస్ రెండు ప్రొజెక్టర్లు తీసుకురావడం అంతేగాక డిగ్రీ ప్రథమ సంవత్సరంలో 345 మంది అడ్మిషన్లు జరిగాయి.2025 26 విద్యా సంవత్సరంలో 81 శాతం మంది ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మెగా జాబ్ మేళాలో విద్యార్థినిలు టెక్ మహేంద్ర, ఇంపోషిష్, జయాలుకాస్,ముత్తూట్ ఫైనాన్స్ మొదలగు సంస్థలలో 105 మంది ఉద్యోగాలు సాధించారు. అంతేగాక కళాశాల సీ.పీ.డీ.సీ మెంబర్ అయిన డాక్టర్ శైలజ 25 కుర్చీలు ,మరో సిపిడిసి మెంబర్ ఆరాధన జార్జి 40 స్టుల్స్ ను ఇచ్చారని వివరించారు. కళాశాల ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ చైర్మన్ ఎస్ రాజమౌళి, డాక్టర్ శైలజ, డాక్టర్ నరేష్ బాబు ,డాక్టర్ శ్రీధర్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పరమేశ్వర చారి, సామాజిక సేవాకర్త టి లక్ష్మణ్ కళాశాల వార్షికోత్సవాన్ని ఉద్దేశించి విద్యార్థునుల లక్ష్యం, ప్రవర్తన ,సమాజం పట్ల గౌరవం, భవిష్యత్తు ప్రణాళిక మొదలగు జీవిత సత్యాల గురించి ప్రసంగించారు. వార్షికోత్సవం లో భాగంగా బీఏ, బీకాం ,బీఎస్సీలలో టాపర్లుగా నిలిచిన భానుజా,ఫిరదౌస్ బేగం,పల్లవి, సింధు, శబ్నం,శ్రావణి ,శ్యామశ్రీ ,భవాని మరియు రచన విద్యార్థినులకు డాక్టర్ శైలజ, డాక్టర్ నరేష్ బాబు ,డాక్టర్ శ్రీధర్, పరమేశ్వర చారి ,లక్ష్మణ్, ఆరాధన జార్జి, డాక్టర్ సుజాత ,పి విజయలక్ష్మి, జెవిఆర్ అర్చన ,రమణారెడ్డి ,డాక్టర్ పద్మావతి డొనేట్ చేసిన బంగారు పతకాలతో సత్కరించారు . అంతేగాక బెస్ట్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ,మెగా సెల్ఫ్ డిఫెన్స్, బేసిక్ కంప్యూటర్స్, వర్క్ షాప్, ఫైనాన్షియల్ అకౌంట్స్ ,ఫుడ్ ఫెస్టివల్, లిటరరీ కల్చరల్, స్పోర్ట్స్ లలో గెలుపొందిన విద్యార్థినులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, బహుమతులను ప్రధానం చేశారు.ఇందులో భాగంగా వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సీపీడీసీ మెంబర్స్ సమక్షంలో కళాశాల మ్యాగ్జిన్ ను కూడా ఆవిష్కరించారు. తదుపరి విద్యార్థినులు ఫేర్వెల్ పార్టీలో నృత్యాలు ,పాటలు, ఏకపాత్రాభినయం మొదలగు ఆహ్లాదకరమైన విన్యాసాలతో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవడం



జరిగింది.ఈ వార్షికోత్సవంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి కమలా క్రిస్టియాన్, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జె ఉమారాణి,ఐకిఏసి కోఆర్డినేటర్ ఎంఎం లక్ష్మి ,స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ శోభారాణి, పేరెంట్స్ అధ్యాపకులు మరియు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు

# ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు

**(ప్రజాస్వరం)మాసాయిపేట ఏప్రిల్**

వేసవిలో ప్రయాణికులు, ప్రజల దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండల కేంద్రంలో రామంతపూర్ బస్ స్టాప్ వద్ద సర్పంచ్ భవాని సౌందర్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని బుధవారం సర్పంచ్ మాట్లాడుతూ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎండాకాలం పూర్తి అయ్యేంతవరకు చలివేంద్రాన్ని కొనసాగించాలని ఈ కార్యక్రమంలో సర్పంచ్ భవాని సౌందర్య ఉప సర్పంచ్ విజయ వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు





# కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా 'గ్రాడ్యుయేట్ డే' ఇటిక్యాల స్కూల్ ముందడుగు.

**జగదేవ్ పూర్ :ఏప్రిల్ 22 (ప్రజాస్వరం)**

జగదేవ్ పూర్ మండలం ఇటిక్యాల ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి శ్రీ సైదులు హాజరై మాట్లాడుతూ.. పాఠశాల చేపడుతున్న వినూత్న కార్యక్రమాలను ప్రశంసించారు. విద్యార్థులచే సభా నిర్వహణ చేయించడం వల్ల వారిలో నాయకత్వ లక్షణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. మాజీ జడ్పీటీసీ లక్ష్మా రెడ్డి పాఠశాలలో 'గ్రాడ్యుయేట్ డే' నిర్వహించడాన్ని అభినందించగా, గ్రామ సర్పంచ్ శ్రీమతి దీనా రాజలింగం మాట్లాడుతూ.. పాఠశాల నాణ్యమైన విద్యను అందిస్తోందని, దీనికి నిదర్శనంగా తన కూతురుని కూడా ఇక్కడే చేర్పిస్తానని ప్రకటించారు. ఉప సర్పంచ్ నరేష్ గ్రామస్తులందరూ ప్రభుత్వ బడిలోనే పిల్లలను చేర్పించాలని కోరుతూ, పాఠశాలకు అన్ని విధాలా సహకరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామ కార్యదర్శి రేఖా గారు పిల్లల ప్రదర్శనలను మెచ్చుకుంటూ, గ్రామస్తుల నుండి ఆర్థిక సహాయం అందేలా చూస్తానని తెలిపారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు నేతి శంకర్ గారు మాట్లాడుతూ.. నర్సరీ నుండి 5వ తరగతి వరకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, ఉత్తమ బోధన అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా నిర్మల్ నగర్ పేరెంట్స్ చేసిన నృత్యం, ఎల్కేజీ విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలో నాయకులు రాజు, వార్డు సభ్యులు భాస్కర్, స్వామి, చైర్మన్ హంసమ్మ, ఉపాధ్యాయులు నరేందర్, శ్రీనివాస్ రెడ్డి, మంజుల, భవాని, కంరోద్దీన్, అనురాధ, సుశీల మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం కేసులో న్యాయం గెలిచింది....

- **పీసీ ఘోష్ కమిషన్‌పై హైకోర్టు తీర్పుకు హర్షం....**
- **మాజీ డిప్యూటీ స్పీకర్,పద్మా దేవేందర్ రెడ్డి....**

**మెదక్ (ప్రజాస్వరం) ప్రతినిధి**

కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ నివేదికకు సంబంధించి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తాజా తీర్పును మాజీ డిప్యూటీ స్పీకర్, మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించడం న్యాయం గెలిచినట్లేనని పేర్కొన్నారు. కమిషన్ విచారణలో ప్రాథమిక న్యాయ నిబంధనలు పాటించలేదని కోర్టు స్పష్టం చేయడం ద్వారా ఆ నివేదికకు చట్టపరమైన బలం లేదని తేలిందన్నారు. ముఖ్యంగా సెక్షన్ 8 కింద సంబంధిత వ్యక్తులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఆరోపణలు చేయడం సరికాదని కోర్టు వ్యాఖ్యానించడం అత్యంత కీలక పరిణామమని తెలిపారు.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాజీ మంత్రి హరీష్ రావు పై రాజకీయ ఒత్తిడి తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కమిషన్‌లను అడ్డంపెట్టుకుని వేధింపులకు పాల్పడిందని విమర్శించారు. అయితే న్యాయస్థానాలపై నమ్మకంతో పోరాడగా చివరకు నిజం గెలిచిందని అన్నారు. తెలంగాణ జీవధారగా భావించే కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ పార్టీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు



కక్షపూరితంగా వ్యవహరించాయని ఆరోపించారు. ప్రాజెక్టు మరమ్మతులను సకాలంలో చేపట్టకుండా దాదాపు రెండున్నరేళ్లు ఆలస్యం చేశారని, గత్యంతరం లేక ఇప్పుడు పనులు ప్రారంభిస్తున్నారని విమర్శించారు.కాళేశ్వరం అంశంలో కేసీఆర్ పై చేసిన ఆరోపణలు నిరాధారమని ఈ తీర్పుతో స్పష్టమైందని, కాంగ్రెస్ మరియు బీజేపీ పార్టీలకు ఈ తీర్పుతో కనువిప్పు కలగాలని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ వేధింపులను పక్కన పెట్టి పాలనపై దృష్టి సారించి, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. న్యాయం ఎప్పటికైనా గెలుస్తుందనే విశ్వాసానికి ఈ హైకోర్టు తీర్పు నిదర్శనమని తెలిపారు...

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502036. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502036,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2007/18184, CELL : 8008609999